ప్రజాశక్తి
మంగళవారం 28 నవంబర్ 2023
5
విజయనగరం

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు డెహ్రాడూన్ లో సబ్ జూనియర్ , క్యాడిట్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విజయనగరం జిల్లా నుండి 12 మంది క్రీడాకారులు ఎంపిక య్యారు. ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జిల్లాకు చెందిన పునీత్ , కుశాల్ ,సాహిత్య సంకీర్తన ,సాత్విక్, ముఖేష్ నిత్యశ్రీ, చరిష్మా , శృతి, దేవన్, హర్షిని, కమల్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి జిల్లా తైక్వాండో అధ్యక్ష ,కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, కోచ్ లు గగన్, యశస్విని, చైతన్య, గౌతమ్ అభినందనలు తెలిపారు.

క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

జోరుగా సాగుతున్న టోల్‌గేట్ నిర్మాణ పనులు

ప్రజల నెత్తిన మరో భారం పడనుంది. ఇప్పటికే విద్యుత్ భారాలు, ఆస్తిపన్నులు, అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న జిల్లా వాసులపై టోల్ ట్యాక్స్ రూపంలో మరో పిడుగు పడనుంది. జిల్లాలోని డెంకాడ మండలం జొన్నాడ సమీపంలో జాతీయ రహదారి 26పై టోల్‌గేటు ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారి సంస్థ నిర్ణయించింది. దీనికి సంబంధించిన పనులు కూడా మూడు నెలల కిందట ప్రారంభమయ్యాయి.

జొన్నాడ వద్ద టోల్‌గేట్

- జోరుగా నిర్మాణ పనులు
- సంక్రాంతి తరువాత ప్రజలపై బాదుడు

ప్రజాశక్తి-భోగాపురం, డెంకాడ

విజయనగరం సమీపంలోని చెల్లూరు నుంచి గొట్లాం వరకు ఇటీవల బైపాస్-రోడ్డు నిర్మించిన విషయం తెలిసిందే. ఆ రహదారి నిర్మించిన నూకాంబిక కన్‌స్ట్రక్షన్ సంస్థయే ఈ టోల్‌గేట్ నిర్మాణ పనులు చేపడుతోంది. బైపాస్ రోడ్డు నిర్మించినందుకు గాను ఆ సంస్థకు టోల్‌గేటు నిర్వహణ అప్పగించినట్లు తెలుస్తోంది. కేంద్రప్రభుత్వం కొంతకాలం క్రితం జాతీయ రహదారుల నిర్మాణాలకు అయిన ఖర్చును ప్రజల నుంచి వసూలు చేసేందుకుగాను ఆయా నిర్మాణ సంస్థలు టోల్ ఫీజులు వసూలు చేసుకునేందుకు వీలు కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇక్కడ టోల్‌గేటు ఏర్పాటవుతోంది. ఈ పనులు మరో రెండు నెలల్లో పూర్తి కానున్నాయి. సంక్రాంతి తరువాత వాహనదారుల నుంచి టోల్ ఫీజు వసూలు చేయనున్నారు. ప్రధానంగా ఒడిశా, చత్తీస్‌ఘడ్‌తో పాటు మన్యం, విజయనగరం జిల్లా వాసులు విశాఖ వెళ్లాలంటే ఆ రహదారి మీదుగానే వెళ్లాలి. ఈనేపథ్యంలో వాహనదారులంతా టోల్‌ట్యాక్స్ కట్టాల్సిందే. ప్రధానంగా విశాఖతో వాణిజ్య సంబంధాలు గల వాహనాలు ఎక్కువగా ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. త్వరలో భోగాపురం వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాలన్నా ఇదే రహదారి నుంచి వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి అధికారులు జొన్నాడ సమీపాన టోల్‌గేట్ నిర్మిస్తే అధిక ఆదాయం వస్తుందని భావించి నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే భూ సేకరణ చేపట్టి పనులు ముమ్మరం చేశారు. ఇక్కడ 8లైన్ల ద్వారా టోల్‌ఫీజు వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. డెంకాడ మండలం నాతవలస వద్ద ఇప్పటికే ఉన్న టోల్‌గేటు వల్ల జిల్లా ప్రజలపై పెద్దగా బారం లేనప్పటికీ ఇక్కడ ఏర్పాటు చేస్తున్న టోల్‌గేటు వల్ల పెనుభారం పడే అవకాశాలు ఉన్నాయి. ప్రజలపై భారాలు వేసేందుకు జాతీయ రహదారి సంస్థ రంగం చేసిన నేపథ్యంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఓవైపు కరువు పరిస్థితులు కాటేసినప్పటికీ కాస్త నీటి వసతి ఉన్నచోట ధాన్యం దిగుబడి బాగానే వచ్చింది. ఇప్పటి వరకు చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో వ్యవసాయశాఖ అధికారుల ఇచ్చిన నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

పండిన చోట పండగే

- పెరిగిన ధాన్యం దిగుబడి
- ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు

జిల్లాలో వరి అత్యంత ప్రధానమైనది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అత్యధికంగా 2,31,835 ఎకరాల్లో సాగైంది. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిపి సాధారణ విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, సెప్టెంబర్ 30 నాటికి 3.53 లక్షల ఎకరాలు(84శాతం) మాత్రమే సాగయ్యాయి. ఆ తరువాత మరో 11శాతం పెరిగింది. ఈలెక్కన మొత్తం ఇప్పటి వరకు 3.90లక్షల ఎకరాలు (93శాతం) వరకు సాగైంది. ఇందులో వరి చాలా వరకు నీటి ఎద్దడితో ఇప్పటికే ఎండిపోయింది. మరికొంత ఇప్పటికీ తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటోంది. మరోవైపు పంట పండిన చోట మాత్రం పండగే అన్నట్టుగా దిగుబడి కనిపిస్తోంది. జిల్లాలో సీజన్ మొత్తానికి 2024 పంటకోత ప్రయోగాలు చేపట్టాల్సివుండగా ఇప్పటి వరకు 980 వరకు పూర్తిచేశారు. వీటిని బట్టి ఎకరాకు 75కేజీల గల 30 బస్తాలు (2,270 కేజీలు) వరకు దిగుబడి వచ్చినట్టు అంచనా వేశారు. మొత్తం పంటకోత ప్రయోగాలు పూర్తయితే ఇంతకన్నా పెరగడం లేదా తగ్గడం వంటివి కూడా ఉండవచ్చని చెబుతున్నారు. స్వల్ప తేడా మాత్రమే ఉంటే గత ఏడాది కన్నా ఈ ఎక్కువ దిగుబడి వచ్చినట్టుగా భావించవచ్చు. గత ఏడాది మొత్తం పంటకోత ప్రయోగాలు పూర్తైయ్యేనాటికి ఎకరా పంట విస్తీర్ణంలో 75కేజీల గల 28 బస్తాలు (2077కేజీలు) దిగుబడి వచ్చింది. దీన్నిబట్టి గతం కన్నా ఎక్కువ దిగుబడి వచ్చినట్టుగా అర్థమౌతోంది. వాస్తవానికి గత ఏడాది వచ్చిన 28బస్తాల దిగుబడి గడిచిన పదేళ్లలో ఎప్పుడూ రాలేదని అధికారులు అప్పట్లో ప్రకటించారు. సుమారు లక్ష ఎకరాల్లో కరువు తాండవించినట్టుగా రైతు సంఘాలు, రైతులు అంచనా వేస్తున్నారు. చాలా వరకు రంగు మారడం, అక్కడక్కడ చేను కుళ్లిపోవడం వంటి కారణాల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. చెడిపోయిన, రంగుమారిన, మొలకొత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు వంటివాటితో నాణ్యతా ప్రమాణాలు తగ్గిస్తామని ప్రభుత్వం చెబుతోంది.

ఈనేపథ్యంలో కరువు మండలాలుగా గుర్తించడం, లేదా ఆర్థికంగా భరోసా పలకడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కేవలం ధాన్యం కొనుగోలు విధానాలపై మాత్రమే ముందుకు సాగుతోంది. పంటలు తీవ్రంగా ఎండిపోవడంతో పాటు నెల తేమశాతం, భూగర్భ జలాల తగ్గడం, రిమోట్ సెన్సింగ్, పశువులకు గడ్డి, దాణా దొరక్క పోవడం వంటి పరిస్థితులు ఎదురైతేనే కరువుగా గుర్తిస్తారట. జిల్లాలో ఖరీఫ్ ఈఏడాది జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన అంశాల్లోనూ కరువు నిబంధనలకు అనుగుణంగా లేవు.

'ఆడుదాం ఆంధ్రా'లో పాల్గొనండి

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన మెగా క్రీడోత్సవం 'ఆడుదాం ఆంధ్ర'లో క్రీడాభిమానులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే వారికోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నేటి నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ప్రారంభమైందని, ఆయా సచివాలయా లకు వెళ్లి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. డిసెంబరు 15 నుంచి 44 రోజుల పాటు ఐదు దశల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో కలసి మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిల్లో, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతాయన్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 15 ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో పాల్గొనదలచిన వారంతా తప్పనిసరిగా సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో అందుబాటులో వున్న మైదానాలను ఎంపికచేసి క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అన్ని గ్రామాలు, వార్డుల నుంచి క్రీడాకారులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు గాను వాలంటీర్ల ద్వారా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల్లో తొలి ఐదు రోజులు గ్రామ స్థాయిలో, 12 రోజులు మండల స్థాయిలో, తర్వాత ఐదు రోజులు నియోజకవర్గ స్థాయిలో, 7 రోజులు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్‌కు 16 మందితో, బాడ్మింటన్‌కు ఇద్దరు, కబడ్డీకి 12 మందితో, 15 మందితో ఖోఖోజట్టును, వాలీబాల్‌కు 12 మంది రిజిష్టర్ కావలసి వుంటుందన్నారు. క్రీడల నిర్వహణకు అవసరమైన కిట్‌లు, ఇతర క్రీడా సామాగ్రిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. పోటీలకు కృష్ణజింకను క్రీడల చిహ్నంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సమావేశంలోజెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, సెట్విజ్ సిఇఒ కె.రాంగోపాల్ పాల్గొన్నారు.

ప్రతీ పిఎస్‌లో ఓటర్ల జాబితా ఉంచాలి

జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు

ప్రజాశక్తి-విజయనగరం, భోగాపురం

ఓటర్ల జాబితాలను ప్రతీ పోలింగ్ స్టేషన్లోనూ ఉంచాలని, జిల్లా పరిశీలకులు, రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదేశించారు. సోమవారం జిల్లాలో పర్యటించారు. భోగాపురం మండలం రాజాపులోవలోని 196, 197 పోలింగ్ కేంద్రాలను, విజయనగరం విటి అగ్రహారంలోని 58-63 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బిఎల్‌ఒలతో మాట్లాడి ఫారం 6,7,8పై ఆరా తీశారు. ఓట్ల చేర్పింపు, తొలగింపు ప్రక్రియపై ఇళ్లకు వెళ్లి విచారణ చేస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. ఫారమ్ 6,7,8 దరఖాస్తులను పరిశీలించారు. కొత్త ఓటర్లపై ఆరా తీశారు. 18 ఏళ్ల నిండినవారిందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ఓట్ల తొలగింపు ప్రక్రియపై ప్రశ్నించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వాటిని వెంటవెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఇఆర్ఒ నూకరాజు, తాహశీల్దార్లు బంగార్రాజు, కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ తాహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై దృష్టి పెట్టాలి

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో యువ ఓటర్లపై దృష్టిపెట్టి, అధిక సంఖ్యలో చేర్పించడం పట్ల ఆయన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ అయి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఓటర్ల ఓటర్ల నమోదుపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డుపై సంతకాలు చేశారు.

భోగాపురం : ఓటరు జాబితాపై బిఎల్‌ఒతో మాట్లాడుతున్న పరిశీలకులు శ్యామలరావు

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని కలెక్టర్ నాగలక్ష్మి ముందుగా వివరించారు. అనంతరం జాబితా పరిశీలకులు శ్యామలరావు మాట్లాడుతూ, జిల్లాలో 18, 19 ఏళ్ల వయసు గల యువ ఓటర్లను అధిక సంఖ్యలో చేర్పించడం అభినందనీయమని అన్నారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తదతర పథకాల లబ్దిదారుల జాబితాలను పరిశీలించి, 18 ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమంపై దృష్టి పెట్టి, దీనికి విస్తత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. అన్ని రకాల ఫారాలను పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఖచ్చితమైన ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా జాబితాలను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, వివిధ నియోజకవర్గాల ఇఆర్‌ఒలు, ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

విశాఖ విధ్వంసమే జగన్ లక్ష్యం

ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడమే ఆయన ఉద్దేశం

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

పచ్చని విశాఖను విధ్వంసం చేయడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికే మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి టిడిపి నాయకులకు ఇష్టం లేదంటూ వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అభివృద్ధిని తాము స్వాగతిస్తామని ,దాని పేరిట భూకబ్జాలు, దందాలు, సెటిల్‌మెంట్లు, ఫ్యాక్షన్ పాలనను ప్రశాంతతకు మారు పేరైన ఉత్తరాంధ్రకు, విశాఖకు తీసుకురావడాన్నే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఇంకా జగన్ ఇక్కడకు రాకముందే రుషికొండను బోడికొండగా మార్చారన్నారు. జగన్ పరిపాలన ఎటువంటిదో, రాష్ట్రం నుంచి పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు ఎందుకు తరలిపోతున్నాయో అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని తెలిపారు. విశాఖను ఐటి కారిడార్‌గా చంద్రబాబు అభివృద్ధి చేశారని.. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే దానిని కొనసాగించవచ్చని హితవు పలికారు. నాలుగున్నరేళ్ల వదిలేసి.. ఎన్నికల ఏడాదిలో ఇక్కడ కాపురం పెట్టి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకూ చేయలేని అభివృద్ధిని ఈ ఆరు నెలల్లో ఎలా చేస్తారన్నారు. న్యాయస్థానం ఆదేశాలనూ గౌరవించకుండా మొండిగా వెళ్లడం సైకో జగన్‌కే సాధ్యమైందన్నారు. వాస్తవానికి విశాఖ పరిపాలన రాజధాని సాధ్యం కాదని వైసీపీ వారికీ తెలుసని.. కేవలం రాజకీయ లబ్ధి, ప్రజలను మభ్యపెట్టడానికే ఇదిగో, అదిగో అంటూ డ్రామాలాడుతూ.. ఇక్కడి తెలుగుదేశం నాయకులపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లాలో పరిశ్రమలు మూతపడటం, నిరుద్యోగ సమస్య అధికమవ్వడం ఇక్కడ నాయకులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి

- డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి
- 11న చలో కలెక్టరేట్ : కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

దళితులు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరణ చేయాలని, డప్పు కళాకారులు చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 11న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్ తెలిపారు. సోమవారం ఎల్‌బిజి భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40, 50 ఏళ్లగా జిల్లాలో దళితులు ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా ప్రభుత్వం నేటికీ ఎటువంటి హక్కులు కల్పించలేదని అన్నారు. భూ రీసర్వే పేరుతో ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టాలిస్తామని చెబుతున్న ప్రభుత్వం దానిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దళితులకు కార్పొరేషన్ ద్వారా అందుతున్న 29 రకాల లోన్లను రద్దుచేసి స్వయం ఉపాధిని దూరం చేసిందని విమర్శించారు. డప్పు కళాకారులకు, చర్మకారులకు రూ.3వేలు పింఛను ఇస్తున్నా పెరిగిన ధరలతో పోల్చుకుంటే చాలటం లేదని తెలిపారు. డబ్బులు, గజ్జలు, దుస్తులు, పనిముట్లు నేటి వరకు మంజూరు చేయలేదని అన్నారు. డప్పు కళాకారులకు శర్మకారులకు బస్సు పాస్ సౌకర్యం కూడా కల్పించాలని, అర్హులైన దళితులకు రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని, శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 11న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రావు, జిల్లా గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు పాల్గొన్నారు.

దయానంద్‌కు అవార్డు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎస్.జాకబ్ దయానంద్‌కు అవార్డు లభించింది. విశాఖపట్నంలో జన జాతీయ గౌరవ దివాస్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ క్రీడల నిర్వహణ అవార్డును ఆయనకు అందజేశారు. దయానంద్‌ను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి, డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి అభినందించారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా తరపున వివిధ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు సాధించిన విజయాలను గురించి కలెక్టర్ తెలుసుకొని వారిని అభినందిస్తూ జిల్లా ఖ్యాతిని వ్యాప్తి చేయడంలో వారు చేసిన కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లోనూ మంచి క్రీడాకారులుగా రాణించి మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

గోవాలో ఇటీవల ముగిసిన జాతీయ క్రీడల్లో స్కే మార్షల్ ఆర్ట్సలో మన రాష్ట్రం తరపున పాల్గొని కాంస్య పతకం సాధించిన ములగపాక అంజనీప్రసాద్ తన తండ్రి, కోచ్ ఎం.త్రినాధరావుతోపాటు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. శ్రీలంకలో వచ్చే జనవరిలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే జట్టుకు తాను ఎంపికైనట్టు వివరించారు. జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి చెందిన ముగ్గురు క్రీడాకారులకు పతకాలు లభించగా అందులో మన జిల్లా కొత్తవలసకు చెందిన ములగపాక అంజనీప్రసాద్ ఒకరని కోచ్ తెలిపారు. సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ కూడా వీరితోపాటు వున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే మన రాష్ట్ర జట్టుకు ఎంపికైన కొప్పెర్ల డా.బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు కూడా జిల్లా కలెక్టర్‌ను కలిశారు. కొప్పెర్ల గురుకుల పాఠశాల జట్టులోని బి.శ్రావణ్ కుమార్, ఎ.అజయ్ రాజులు అండర్-19 జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. నగరంలోని నాగవంశం వీధికి చెందిన కనకల శ్రావణ్ కుమార్ జాతీయ జూనియర్ జట్టుకు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా మహిళా జట్టు

ఈనెల 29,30, డిసెంబర్ 1 వ తేదీ నుంచి కర్నూల్ జిల్లా గోనెగండ్ల లో జరగబోయే 70వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో జిల్లా మహిళా జట్టు పాల్గొంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు దొర తెలిపారు, వారం రోజులుగా సీటీ క్లబ్ లో శిక్షణ అనంతర 12 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభావతి తెలిపారు.. ఈ సందర్భంగా జిల్లా జట్టు మంచి ప్రతిభ చూపాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు,మరియు కార్యవర్గ సభ్యులు తెలిపారు.

క్రీడాకారుడిని అభినందిస్తున్న కలెక్టర్, జెసి

సంగీత కచేరి చేస్తున్న కనకదుర్గ ప్రసాద్ తదితరులు

సుస్వరం భమిడిపాటి వీణా నాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర పర్యాటక శాఖ, కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన, ప్రముఖ వీణా విద్వాంసులు భమిడిపాటి కనకదుర్గ ప్రసాద్ వీణ కచేరీ ఆద్యంతం శ్రోతలను రంజింప చేసింది. సత్సంప్రదాయ సంగీతానికి అద్దంపడుతూ కనకదుర్గ ప్రసాద్ పలు కీర్తనలను వీణపై పలికించిన తీరు ఆహుతుల మన్ననలందుకుంది. బొబ్బిలిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం లో జరిగిన ఈ కచేరికి, మృదంగంపై వంకాయల వెంకట రమణమూర్తి, మోర్సింగ్ పై గొట్టుముక్కల వెంకటేష్ అందించిన సహకారం కచేరీని రక్తి కట్టించింది. జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీ నారాయణ, పలువురు ఇతర ప్రముఖులు, సంగీత ప్రియులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంకేతిక కారణాల వల్లే ఆలస్యం : జెడి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రైతులకు చెల్లించాల్సిన రైతు భరోసా డబ్బులు సాంకేతిక కారణాల వల్లే రైతుల ఖాతాల్లో వేయడం ఆలస్యం అవుతోందని వ్యవసాయశాఖ జెడి బిటి రామారావు తెలిపారు. సోమవారం ప్రజాశక్తిలో 'రైతులకు అందని భరోసా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు జిల్లాలో 2,63,394 మంది రైతులకు రూ.52.67కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ లబ్ధిని దశల వారీ రైతుల ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలు, బ్యాంకులకు మూడు రోజులు సెలవులు రావడంతో ఖాతాల్లో జమ కావడం ఆలస్యం అయ్యిందని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావం పరిస్థితుల వల్ల ఎస్.కోట నియోజకవర్గంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట తీవ్ర దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని టిడిపి నాయకులు గొంప కృష్ణ అధికారులకు తెలిపారు. కరువు ప్రాంతంగా గుర్తించి రైతులకు ఒ ఎకరాకు రూ.40వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఈమేరకు కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతి అందజేశారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత వినతులు స్వీకరించారు. ఎస్.కోట నియోజకవర్గ టిడిపి నాయకులు గొంప కృష్ణ ఆధ్వర్యంలో వేపాడ మండలంకు ప్రాంతాల రైతులు తడిసిన, మొలకలు వచ్చిన వరి దుబ్బులను తీసుకొచ్చి కలెక్టర్‌కు చూపించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్.కోట, వేపాడ, లక్కవరపుకోట జామి, కొత్తవలస మండలాల్లో వర్షాభావం వల్ల రైతులు 80 శాతం పంట నష్టపోయారని, మిగతా 20శాతం పంట పండినప్పటికీ చేతికొచ్చిన తరుణంలో వర్షంతో తడిసిపోయి నష్టపోయారని తెలిపారు. తడిసిన ధాన్యం గింజలకు మొలకలు వచ్చాయని, దీంతో రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కరువు ప్రాంతంగా గుర్తించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు, ప్రసాదుల లక్ష్మీప్రసాద్, గంటాపోలినాయుడు, ఐవిపి రాజు తదితరులు కలెక్టర్‌కు వినతినిచ్చారు. మండల పరిధిలో ప్రతి గ్రామంలోనూ చెత్త పేరుకుపోయి మురికి కాలువలు కంపు కొడుతున్నాయని, దోమలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓట్లను వెంటనే చేర్చాలని పెదవేమలి గ్రామస్తులు వినతినిచ్చారు. గ్రామ ఓటరు జాబితాలో 126 ఓట్లు గల్లంతయ్యాయని తెలిపారు. సమగ్ర విచారణ జరిపించి బిఎల్ఒ పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అట్టాడ సర్పంచ్ అప్పన్నదొర కోరారు.

పూర్తిస్థాయిలో పరిష్కరించాకే ఆన్‌లైన్‌లో నమోదు : కలెక్టర్

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు పూర్తిస్థాయిలో పరిష్కరించిన మీదటే ఆన్‌లైన్ లో పరిష్కారం అయినట్లుగా చూపాలని, అసంపూర్తి నివేదికలను ఇవ్వొద్దని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ఒకసారి పరిష్కరించినట్టు చూపిన వినతులను మళ్లీ తెరిచే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో వినతులు వస్తున్న ప్రభుత్వ శాఖలు తమకు అందుతున్న వినతులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని చెప్పారు. డిఆర్ఒ రాజేశ్వరి, ఎస్‌డిసిలు సుదర్శనదొర, సుమబాల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం : ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఎస్‌పి ఎం.దీపిక ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో మొత్తంగా 42 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి, ఎస్‌బి సిఐలు పాల్గొన్నారు.

స్పందనలో కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న టిడిపి నాయకులు

కలెక్టర్‌కు టిడిపి నాయకుల వినతి

కుళ్లిపోయిన వరి దుబ్బులను చూపిస్తున్న గొంప కృష్ణ, రైతులు

ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి వాణి

కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

శృంగవరపుకోట : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి సబ్బవరపు వాణి న్యాయవాదులు, ఉద్యోగులచే సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. అందరూ రాజ్యాంగానికి బద్దులై నడుచుకోవాలని న్యాయమూర్తి వాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యు.ఎస్.శర్మ, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, బీవీఎస్ రామారావు, బి.సత్యనారాయణ, యలమంచిలి ప్రసాద్, టీవీఆర్ మూర్తి, సీహెచ్ఆర్ఏఎస్ నాయుడు, బి.వెంకటరావు, బి.శివశేఖర్ బాబు, శేఖర్, ముక్కు అనూరాధ, కోర్టు సూపరింటెండెంట్ సంపత్, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో కలిసిన వారితో బేబినాయన, తెంటు రాజా

టిడిపిలో 70 కుటుంబాలు చేరిక

బొబ్బిలి: రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన 70 వైసిపి కుటుంబాలు ఆపార్టీను వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. కోటలో వీరందరికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాజీ ఉప సర్పంచ్ వి.అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు జరగకపోవడంతో వైసిపిని వీడి టిడిపిలో చేరామన్నారు. వైసిపి హయాంలో అభివృద్ధి జరగడం లేదని టిడిపి యూత్ అధ్యక్షులు ఎం.వెంకటరమణ అన్నారు. నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు ప్రజలు విసుగు చెంది టిడిపిలో చేరుతున్నారన్నారు. తెర్లాం, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండలాలు నుంచి భారీగా చేరికలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.తిరుపతిరావు, కె.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

నివాసమున్నచోటే పట్టాలివ్వాలి

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 60 ను తక్షణమే అమలు చేయాలని, పేదలు నివాసం ఉన్న చోటే 100 గజాలు స్థలం ఉచితంగా రెగ్యులర్ చెయ్యాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఎల్ బి జి నగర్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఎల్ బి జి నగర్, రామకష్టా నగర్, గురజాడ నగర్, వినాయకా నగర్, బుంగ వీధీ, బొగ్గులదిబ్బ, గంజిపెట, జొన్న గుడ్డి, నల్ల చెరువు,తది తర చోట్లపేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా, వారికి నివాసం ఉన్నచోటే పట్టాలివ్వ కుండా ఊరవతలకు ప్రభుత్వాలు తరిమేస్తున్నాయని అన్నారు. జీఓ 60ను ఉపయోగించుకుని ఆక్రమణ దారులు రెగ్యులర్ చేసు కుంటున్నారని తెలిపారు. పేదలు నివాసం ఉన్న చోటే ఇళ్లు నిర్మించాలని భవిష్యత్ పోరాటాలు చేస్తామన్నారు. సిపిఎం నాయకులు పి.రమణమ్మ అధ్యక్ష తన జరిగిన సమావేవంలో బి. రమణ, పుణ్యవతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

అసంబద్ధ తనిఖీలతో తీవ్ర నష్టం

విజయనగరం టౌన్ : విద్యారంగంలో ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు విద్యా వ్యవస్థను చక్కదిద్దే విధంగా కాకుండా ఉపాధ్యాయ వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. సోమవారం మున్సిపల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులను దోషులుగా చూపడం భావ్యం కాదని అన్నారు. తనిఖీలు విద్యారంగాన్ని బలోపేతం చేసేవిధంగా ఉండాలి తప్ప, చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఒక పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉంటే 90 మంది టాలెంట్ ప్రదర్శించినా కేవలం 10 మంది విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులను వేధించడం సమాజానికి శ్రేయస్సు కాదని అన్నారు. పట్టణ ప్రాంత విద్యార్థులు కన్నా గ్రామీణ ప్రాంత విద్యార్థులు సామర్థ్యాల విషయంలో కొంత వెనుకబడి ఉంటారని అన్నారు. సమావేశంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాస్, బంకపల్లి శివ ప్రసాద్ చిట్టి రాము నాయుడు, రెడ్డి గణపతి, చలుమూరి రమేష్, రెడ్డి భాస్కర్, రంది శ్రీను, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ ప్రగతి

విజయనగరం కోట: విద్యతోనే సమాజ ప్రగతి సాధించవచ్చునని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. సోమవారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో శ్రీనివాస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు ముందుగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు పూలే వేషధారణలో పిల్లలకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ పాఠశాల స్థాపించి స్త్రీ విద్యపై కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. స్త్రీ విద్యతోనే సమాజం అభివృద్ధి చెంది ముందుకు పయనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు పని చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.రమేష్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సోమవారం నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయని, ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పారు. కాంగ్రెసుతోనే దేశ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా పాలన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు ముద్వల శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రోడ్ల పరిస్థితి అధ్వానం

ప్రజాశక్తి- బాడంగి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రహదారులు పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందని ముఖ్యంగా పారధి బ్రిడ్జి డామేజ్ అయినా ప్రభుత్వం పట్టించు కోలేదని గజరాయినివలస ఎంపిటిసి, టిడిపి ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. ఆయన సోమవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ పారాధి వంతెనను బాగుచేయకపోవడంతో అటువైపుగా వెళ్లే అతి భారీ వాహనాలను రామభద్రపురం కూడలి నుంచి ఆకులకట్ట నుంచి బొబ్బిలి, రాజాం, శ్రీకాకుళం రూట్‌లో పంపిస్తున్నారన్నారు. దీని వల్ల రద్దీ పెరిగి రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి పాడైపోయిందన్నారు. ఎరుకుల పాకలు గ్రామం వద్ద అతి ప్రమాదకరమైన మలుపు ఉండటంతో స్కూల్ పిల్లలను పక్క గ్రామమైన గజరాయని వలస గ్రామంలో ఉన్న యూపి స్కూల్‌కి పంపించడానికి పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారాధి బ్రిడ్జిని బాగుచేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న గౌరు

కుంపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- వేపాడ

మండలం లోని కుంపల్లిలో ఆదివారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరించారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోవాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే మహాశక్తి, తల్లికి వందనం పేరుతో పిల్లలకు రూ.15వేలు ఆర్థిక సాయం చేస్తారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ. 15 ఇస్తారన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తారని అన్నదాతకు ఏటా రూ. 20వేలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం టిడిపి మహిళ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు ఎం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు సిరికి రమణ, మాజీ సర్పంచ్ మంచిని అప్పుల సూరి, కొట్టానా అర్జునరావు, నరిసిపల్లి వెంకటరమణ, కుం పల్లి చెప్పదేముడు, బక్క నాయుడుపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో గురించి వివరిస్తున్న గొంప కృష్ణ

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా మీసాల

ప్రజాశక్తి- చీపురుపల్లి

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా మీసాల అప్పలనాయుడు ఎన్నికయ్యారు. 49వ జిల్లా కౌన్సిల్ సమావేశం విజయనగరంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. గతంలో 6సార్లు యుటిఎఫ్ చీపురుపల్లి మండలశాఖ అధ్యక్షులుగా, 6 సార్లు జిల్లా కౌన్సిలర్‌గా,6 సార్లు రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేశారు. మండలంలోని చిననడిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎమ్‌గా పనిచేస్తున్న అప్పలనాయుడు స్వగ్రామం ఇటకర్లపల్లి. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన అప్పలనాయుడును నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఉపాధ్యాయుల అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లతోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి మరింత కృషి చేస్తామని చెప్పారు.

ఎం. అప్పలనాయుడు

అందరినీ సమన్వయం చేసుకుంటా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజకవర్గంలో అందరినీ సమన్వ యం చేసుకుని పనిచేస్తానని నియోజకవర్గ టిడిపి పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ సువ్వాడ రవి శేఖర్ అన్నారు. ప్రస్తుత ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్న సువ్వాడకు పోల్ మేనేజ్ మెంట్ సమన్వయకర్తగా అధిష్టానం మరో బాధ్య తను అప్పగించడంతో పద్మావతి నగర్‌లో రవిశేఖర్ ఇంటి వద్ద నగర పంచాయతీ టిడిపి కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, వార్డు టిడిపి ప్రతినిధులు కాళ్ళ సత్యవతి, శ్రీను, మజ్జి ఆదినారాయణ, సత్యనారాయణ, లక్ష్మణరావు, పొడుగు కృష్ణవేణి అతన్ని సత్కరించారు. రవిశేఖర్ మాట్లాడుతూ పార్టీ అప్పచెప్పిన బాధ్యతలును శక్తి వంచన లేకుండా నెరవేరుస్తానన్నారు. పోల్ మేనేజ్మెంట్ అనేది పార్టీకి ఎంతో కీలకమైనదని అటువంటి బాధ్యతలు తనపై నమ్మకంతో అప్పగిం చడం తనకు మరింత బాధ్యత పెరిగిందని నియోజ కవర్గంలో అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాను అని చెప్పారు.

రవిశేఖర్‌ను సత్కరిస్తున్న మహిళా నాయకులు

కందిపప్పు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని తెల్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. తెల్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు ప్రభుత్వం పంపిణీ చేసినప్పటికీ ఎక్కడా లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం 25 శాతం మాత్రమే కంది పప్పు పంపిణీ చేయడంతో తర్వాత నెల 50 శాతం ఇస్తే 75 శాతం మంది కార్డుదారులకు పంపిణీ చేస్తామని డిఎంయు ఆపరేటర్లు చెపుతున్నప్పటికి కంది పప్పును పక్కదారి పట్టించారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో కంది పప్పు కిలో రూ.200 వరకు ఉండడంతో కొంతమంది డిఎంయు ఆపరేటర్లు కంది పప్పును అమ్మేసినట్లు దామోదర్ ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేసి కంది పప్పు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దారా పాత్ర బహూకరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామ శివాలయానికి గుదే శ్రీనివాసుల నాయుడు, రాధికా నాయుడు దంపతులు 1.5కిలోల వెండితో తయారు చేసిన దారా పాత్రను బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొంప వెంకటరావు దంపతులు, గల్లా రామచంద్రుడు మాస్టారు పాల్గొనగా అర్చకులు మేడపాటి కిషోర్ దాతలను ఆశీర్వదించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిలిచిన ఆర్‌బికె నిర్మాణం

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామంలో ప్రారంభించిన ఆర్‌బికె నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఈ భవన నిర్మాణాన్ని సర్పంచ్‌కు అప్పగించకుండా కొంపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం వాటి నిర్మాణానికి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిచిపోతున్నాయి. త్వరగా నిర్మాణం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

డివిజి శంకర్రావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న రైతులు

భూ సమస్య పరిష్కరించండి

విజయనగరం: మెట్టు భూముల సమస్యను పరిష్కరించాలని మెంటాడ మండలం పనుకువలస గ్రామానికి చెందిన గిరిజనులు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతి అందజేశారు. కొండ దొర ఎస్‌టికి చెందిన శిగడం సింహాచలం తమ తాతల కాలం నుంచి ఐదు ఎకరాల మెట్టు భూమిని సాగు చేసుకుని మొక్కలు పెంచుకొని బతుకుతున్నాడు. మెంటాడ తహశీల్దార్ కార్యాలయ ంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పుడు విస్తీర్ణం ఐదు ఎకరాలకు బదులు 21 సెంట్లుగా నమోదు చేశారని, తెలిపారు. ఈవిషయం తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

మన ఊరిలో జనవాణి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మహంతి పేటలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ లోకం మాధవి ఆదివారం రాత్రి గడపగడపకి జనసేన కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన సిద్ధాంతాలు, మేనిఫెస్టోని వివరించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారిన తమ్కుఉ రోడ్డు వేయలేదన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి వెళ్ళాలన్నా ఆటో కార్మికులు ఆ రోడ్లలో వెళ్ళడానికి భయపడి రావడం లేదన్నారు. రాత్రి వేళలో ట్యూషన్ నుంచి రావాలంటే కనీసం వీధి దీపాలు కూడా లేవని చాలా భయానక స్థితిలో బ్రతుకుతున్నామని వాపోయారు. ఒక్క నాయకుడు కూడా తమ ఊరు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని చెప్పారు. లోకం మాదవి మాట్లాడుతూ జనసేన ప్రభుత్వం రాగానే సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పైల శంకర్, రామ్ లక్ష్మణ్, శ్రీనివాస్ మురళి, సీతం నాయుడు, శ్రీను, లక్ష్మణ్, శివ సంతోష్, ఈశ్వరరావు, పైడిరాజు, శ్రీను, సురేష్, రాజ్ కుమార్, వీర మహిళలు మాధవి, రాజేశ్వరి, జమయ, స్వాతి, నిఖిత పాల్గొన్నారు.

గ్రామంలో ప్రచారం చేస్తున్న లోకం మాదవి, తదితరులు

లింగ వివక్షపై అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెద్దవేమలి, బూడిపేట, గంట్యాడ, బుడతనాపల్లి, రామభద్రపురం, కొర్లాం, లక్కిడాం గ్రామంలో లింగ వివక్ష పై ఎపిఎం శ్రీనివాసరావు సోమవారం అవగాహన కల్పించారు. లింగ ఆధారిత హింస నిర్వచనం, హింసరూపాలు అందుబాటులో ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, మానవ అక్రమ రవాణా ద్వారా ప్రభావితమైన మహిళలు, పిల్లలు గుర్తింపుపై స్వయం సహాయక బృందాలు గ్రామ సంఘాల పాత్ర బాధ్యతలు గురించి వివరించారు. మండలంలోని పలు గ్రామాలలో లింగ వనరులు కేంద్రాలు బలోపేతం చేయడంపైన వివరించారు. ప్రతి గ్రామంలోని బాల్యవివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత గ్రామ సంఘాల పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం సైలెస్, సీసీలు చినబాబు, అచ్చంనాయుడు, గౌరీశ్వరి, ముత్యాల నాయుడు, సంక్షేమ సహాయకులు, మహిళా పోలీసు, విఒఎలు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

మా భూములు మాకివ్వండి

ప్రజాశక్తి- బొబ్బిలి

మా భూములు మాకివ్వాలని బాడంగి మండలం హరిజన పాల్తేరు గ్రామానికి చెందిన దళిత రైతులు అలజంగి అలేషమ్మ, వై. రామారావు, వై. సుధ, అలజంగి సూరమ్మ, వై. గైరమ్మ, ఎ. యాదమ్మ, వై. వెంకయ్య ఆర్‌డిఒ ఎ. సాయిశ్రీని కోరారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తమ భూమి ఇప్పించాలని దరఖాస్తు ఇచ్చారు. కొన్నేళ్ల క్రితం తమకు ప్రభుత్వం ఒకొక్కరికి 1.80సెంట్లు చొప్పున ఏడుగురికి 12.60 ఎకరాలు ఇస్తే కోడూరు గ్రామానికి చెందిన అలమండ ఆనందరావు అక్రమించేసి రీసర్వేలో మా భూములను ఆయన పేరు మీద రాపించుకున్నారన్నారు. తమ భూమి తమకు ఇప్పించాలని కోరారు. తమ భూమి తమ పేరు మీద లేకపోవడంతో రైతు భరోసా, ఇతర రాయితీలు రావడం లేదన్నారు. రైతులకు న్యాయం చేయాలని శివడవలస సర్పంచ్ వి.నారాయణరావు కోరారు. దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని రైతులకు ఆర్‌డిఒ సాయిశ్రీ హామీ ఇచ్చారు.

ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న రైతులు

గ్యాస్ లీకై వృద్ధుడికి గాయాలు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని గవరవీధిలో ఇటీవల వంట గ్యాస్ సిలిండర్ లీకై పేలుడు ప్రమాదం సంభవించిన ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా ఐదుగురికి గాయాలై విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మరో వంటగ్యాస్ లీకై సిలిండర్ రెగ్యులేటర్ ముట్టుకోవడంతో మరో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో వృద్ధునికి గాయాలవడంతో ఎస్‌కోట సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్జాం గ్రామానికి చెందిన తూర్పాటి సత్యం (నాగమయ్య) (70) టీ పెట్టుకునేందుకు సోమవారం సాయంత్రం తన ఇంట్లో గ్యాస్ స్టవ్‌ను వెలిగించారు. అప్పటికే సిలిండర్ రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీక్ అవడంతో రెగ్యులేటర్ ముట్టుకుంది. ఈ ఘటనలో సత్యం స్వల్పంగా గాయపడగా వంట గదిలో ఉన్న సామాగ్రి కొంతమేర కాలాయి. ఆ సమయంలో మిగిలినవారు వరిచేను కోతల పనులలో ఉండడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. స్థానికులు మంటలను అదుపు చేసి 108 వాహనంలో క్షతగాత్రుడును ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. తహశీల్దార్ టి కళ్యాణచక్రవర్తి, ఆర్‌ఐ సన్యాసిరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదపు వివరాలు సేకరించారు.

వాహనాలు సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. గ్రోత్ సెంటర్ సమీపంలోని చెరువులో అధికార పార్టీకి చెందిన ఒక నేత ఎటువంటి అనుమతులూ లేకుండా గ్రావెల్ తవ్వుతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్లు ఎం.బూర్జవలస విఆర్‌ఒ రేవతికు సమాచారం రావడంతో చెరువు వద్దకు చేరుకుని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తికు సమాచారం ఇచ్చారు. అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న జేసిబి, టిప్పర్లను సీజ్ చేయాలని విఆర్‌ఒను ఆర్‌ఐ ఆదేశించడంతో జేసీబీ, మూడు టిప్పర్లను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. జేసీబీ, టిప్పర్ల తాళాలు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని తమ వద్దే ఉంచుకున్నప్పటికి అధికార పార్టీకి చెందిన నేత కావడంతో సీజ్ చేసిన జేసీబీ, టిప్పర్లను వేరే తాళాలతో తీసుకుని వెళ్లిపోయారు. సీజ్ చేసిన టిప్పర్లను, జేసీబీను తీసుకుపోయినట్లు రెవెన్యూ అధికారులకు తెలియడంతో వెంటనే తీసుకు పోయిన జేసీబీ, టిప్పర్లను వెనక్కి తెప్పించి పోలీసులకు అప్పగించినట్లు ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డోల రాజేశ్వర రావు హెచ్చరించారు.

జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పాదలాడ గ్రామంలో యువగళం పాదయాత్ర పునః ప్రారంభం సందర్భంగా నెల్లిమర్ల నియోజ కవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని లోకేష్ వారికి సూచించారు.

ప్రజాశక్తి- భోగాపురం, విజయనగరంకోట

లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేసి ఇల్లు నిర్మించడంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు కోప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోల జగన్ చెప్పారు. మల్లమ్మపేటలో మున్సిపల్ స్థలంలో కమ్యూనిటి మరుగుదొడ్లు ఉండేవని, ఆ స్థలాన్ని మల్లమ్మపేటకు చెందిన వ్యక్తి ఆక్రమించేసి ఇల్లు నిర్మాణం చేశారన్నారు. మున్సిపల్ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని లోకాయుక్తకు పిర్యాదు చేశామని చెప్పారు.